క్లుప్తంగా

3,4న మిట్స్‌లో జాతీయ స్థాయి టెక్నికల్ కల్చరల్ ఫెస్ట్

కురబలకోట: మండలంలోని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో వచ్చేనెల 3,4న జాతీయ స్థాయిలో టెక్నికల్, కల్చరల్ స్పోర్ట్స్‌ను అశ్వ-2023 పేరుతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ శుక్రవారం తెలిపారు. 3న సాయంత్రం సినీ హీరో సత్యదేవ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. 4న సింగర్స్ అరుణ్ కౌండిల్య, శృతి రంజని, జబర్దస్త్ ఫేం అభినయ కృష్ణ కామెడితో పాటు మిమిక్రీ ఆర్టిస్టు దీపక్ పాల్గొంటున్నట్లు తెలిపారు.

పూడికతీత పనుల తనిఖీ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని సంపతికోట పంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పూడికతీత పనులను శుక్రవారం ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి తనిఖీ చేసారు. పని ప్రదేశంలోని మస్టర్, కూలీల పేర్లు పరిశీలించారు. ఎంపీడీవో కూలీలనుద్దేశించి మాట్లాడుతూ ఇన్నాళ్ళూ ఒక పని దినానికి రూ.257లు అందేవని ప్రస్తుతం రూ.272కు పెంచిందన్నారు. గ్రామంలో ఉన్న మిగిలిన వారు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని సూచించారు. ఆయన వెంట ఏపీవో మహేష్,క్షేత్ర,సాంకేతిక సహాయకులు సతీష్, గోపాల్ ఉన్నారు.

సారా స్వాధీనం

కేవీపల్లె : పది లీటర్ల సారా స్వాధీనం చేసుకుని నిందితున్ని అరెస్ట్ చేసినట్లు సెబ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవి, సీఐ గురుప్రసాద్ తెలిపారు. మండలంలోని జిల్లేళ్లమంద తండా పరిసర ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. తండాకు చెందిన రెడ్డినాయక్‌ను అరెస్ట్ చేసి అతని వద్దనుంచి సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే 400 లీటర్ల ఊట ధ్వంసం చేసినట్లు చెప్పారు. దాడిలో సెబ్ ఎస్ఐ లక్ష్మీనరసయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

వాల్మీకిపురం: మే 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎఫ్ ఏసీ మండల న్యాయ సేవాధి కార సంస్థ చైర్ పర్సన్ జ్యోతి ఓ ప్రకటనలో తెలిపారు. రాజీ కాబడిన క్రిమినల్, సివిల్, చెక్ బౌన్స్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, తదితర వాటిని పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ చక్క వేదిక అన్నారు. రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకొని జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఆమె కోరారు.

మే 1న ఉచిత ఖత్నా

పీలేరు రూరల్ : స్థానిక ఆక్సా మసీదు వద్ద మే 1న ఉచిత ఖత్నా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు అతికా షఫీ తెలిపారు. డాక్టర్ అబ్దుల్ రజాక్, డాక్టర్ మస్తాన్ పిల్లలకు ఉచితంగా ఖత్నా చేయనున్నట్లు తెలిపారు. ఖత్నా చేసుకున్న పిల్లలకు ఉచితంగా మందులు, పౌష్టికాహారం అందచేస్తామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9492378754 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మే 1 నుంచి మహాభారత యజ్ఞం

పీలేరు రూరల్ : పీలేరు పట్టణం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మే 1 నుంచి 18వ తేదీ వరకు మహాభారత యజ్ఞం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మే 1న ధ్వజారోహణంతో మహాభారతయజ్ఞం ప్రారంభం అవుతుందన్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం భాగవతారిణి మునిలక్ష్మీ హరికథాగానం ఉంటుందని తెలిపారు. మల్లికార్జున కళాబృందంచే రాత్రి నాటకాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రేపు వాసవీ జయంతి వేడుకలు

మదనపల్లె సిటీ: వాసవీ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పి.ఓంప్రకాష్ తెలిపారు. శుక్రవారం స్థానిక వాసవీభవన్‌వీధిలోని వాసవికన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో జయంతి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 30న ఉదయం వెంకటరమణస్వామి ఆలయం నుంచి కన్యకలు, దంపతులచే గంగ తెచ్చుట, స్వస్తి వాచనం, అమ్మవారికి విశేష అలంకరణ జరుగుతుందన్నారు. ఆర్యవైశ్య యువకులచే పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం ఆర్యవైశ్య కళ్యాణమండపంలో భోజన సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేక అలంకరణతో అమ్మవారిని పుష్పపల్లకి ఊరేగింపు కన్నుల పండవుగా జరుగుతుందన్నారు. కార్యక్రమాలు ఆర్యవైశ్యులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

పీలేరు : ఉపాధి కూలీలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఒంటిల్లులో ఉపాధి కూలీలకు వడదెబ్బ తీవ్రతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ఎండ తాకిడికి గురి కాకుండా కూలీలు ఓఆర్ఎస్ ద్రావణం, మజ్జిగ, మంచినీరు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఈ కొండయ్య, ఏఎన్ఎం వసుంధర, వెంకటరత్న, నాగముత్యం, సద్దాం హుస్సేన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజారంజక పాలనే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: ప్రజా రంజక పాలన అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆరమడక, మూగలమర్రి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, కాలువలు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ దీపాలు, పింఛన్లు, ఇండ్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే చింతల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజానీకం సంతోషం వ్యక్తం చేస్తున్నారని, రాబోవు ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డినే గెలిపించుకుంటామని చెబుతుండడం సంతోషంగా ఉందన్నారు. అవినీతి రహితంగా అందుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు ఆస్వాధిస్తున్నారని స్పష్టం చేశారు. మరింత మెరుగైన పాలన సాగించేందుకు ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి సత్వర పరిష్కారానికి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఆదర్శంగా, పారదర్శకంగా రాష్ట్రంలో పాలన కొనసాగుతుందన్నారు. పేదలు, మహిళలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వాలంటీర్ల ద్వారా అధికారుల దృష్టికి తీసుకొస్తే, సమస్యను పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో షబ్బీర్ అహ్మద్, సర్పంచ్ భాస్కర్, నాయకులు యోగేంద్రనాథ్ రెడ్డి, రెడ్డిశేఖర్ రెడ్డి, స్వామిరెడ్డి, మాధవ రెడ్డి, నాగరాజ, నీళ్లభాస్కర్, సురేష్ రెడ్డి, శివారెడ్డి, శంకర, రాయుడు,ఆనంద, రవి, షాహెద్, అన్ని శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

సాకారమవుతున్న పేదల సొంతింటి కల



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మురళి

కురబలకోట: పేదల సొంతింతి కలను ప్రభుత్వం సాకారం చేస్తోందని ఆర్డీఓ మురళి అన్నారు. శుక్రవారం ఆయన కంటేవారిపల్లె కాలనీలో జరుగుతున్న జగనన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. మౌలిక సదుపాయాలు, ఇతర సౌకర్యాలపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఈ కాలనీని మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతామన్నారు. ఇప్పటికే తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. త్వరలో వీధి దీపాలు, మురికినీటి కాలువలు, రోడ్లు కూడా వేయడం జరుగుతుందన్నారు. ఎప్పటికప్పుడు బిల్లులు పడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవైనా సమస్యలున్నా వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు కూడా త్వరిత గతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. అధికారులు కూడా ప్రణాళిక బద్ధంగా సమన్వయంతో వ్యవహరించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. మండల ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి, తహశీల్దారు ఎం. భీమేశ్వరరావు, ఎంపీడీఓ దిలిప్‌కుమార్, హౌసింగ్ అధికారి వెంకటరెడ్డి, ఆర్ఐ సుగుణ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా బావాజాన్ బాధ్యతల స్వీకరణ



మదనపల్లె : మండల ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ బావాజాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ భూముల కాపాడేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా మండల రెవెన్యూ, సచివాలయ సిబ్బంది ఎఫ్ఏసీ తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి

వాల్మీకిపురం: గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను గుర్తించి, వెంటనే చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ వెంకట్రమణ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవంలో వైస్ ఎంపీపీ వెంకట్రమణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, పరిశుభ్రత తదితర అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్ మాట్లాడుతూ మండల అభివృద్ధే లక్ష్యంగా అందరం కలసి పని చేద్దామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నిర్మల, వైస్ ఎంపీపీ కిరణ్ కుమార్, సింగల్ విండో అధ్యక్షులు రామక్రిష్ణారెడ్డి, సర్పంచ్ గంగులమ్మ, కోఆప్షన్ సభ్యులు మహబూబ్‌బాషా, మండల ప్రత్యేక ఆహ్వానితులు నాగరాజ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఉత్పత్తులతో స్వయం ఉపాధి

కలికిరి: చిరుధాన్యాల ఉత్పత్తులతో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని కేవీకే కో-ఆర్డినేటర్ పాండురంగ అన్నారు. చిరుధాన్యాల ఉత్పత్తులపై శిక్షణలో భాగంగా శుక్రవారం కేవీకే కార్యాలయంలో జొన్న మురుకులు, జొన్న మిక్చర్, రాగి మురుకులు, రాగి లడ్డులు, బిస్కెట్లు తదితరాలు తయారీపై చేసి చూపించారు. అనంతరం శిక్షణ పొందుతున్న మహిళలచే స్వయంగా చిరుధాన్యాల ఉత్పత్తులను తయారు చేయించారు.

సెబ్ స్టేషన్‌కు స్థలం కేటాయించాలని వినతి

పీలేరురూరల్ : పీలేరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌కు స్థలం కేటాయించాలని సెబ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవి కోరారు. శుక్రవారం తహసీల్దార్ రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెబ్ స్టేషన్ అద్దె భవనంలో నడుస్తోందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెబ్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించుటకు స్థలం కేటాయించాలని విన్నవించారు.

సారా తయారీ చేస్తే చర్యలు

వాల్మీకిపురం: నాటుసారా తయారీ, విక్రయాలు చేస్తే చర్యలు తప్పవని ఎస్ఈబీ సీఐ శివసాగర్, సివిల్ ఎస్ఐ నాగేశ్వర రావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎగువ మేకలవారిపల్లిలో నాటుసారా స్థావరాలపై పోలీసులు, ఎస్ఈబీ పోలీసులు కలసి దాడులు నిర్వహించారు. దాడుల్లో 400 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమంగా నాటుసారా తయారీ, విక్రయాలు చేయడం నేరమన్నారు. ఎవరైనా గుట్టుచప్పుడు కాకుండా నాటుసారా తయారీ, విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా రైతుల భూములకు హద్దు రాళ్లు

పెద్దతిప్పసముద్రం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు - భూ రక్ష పథకంలో భాగంగా ఇప్పటికే రీసర్వే పూర్తయిన గ్రామాల రైతులకు నయా పైసా ఖర్చు లేకుండా ఉచితంగా భూముల హద్దుల రాళ్ళను పొలాల్లో నాటించే కార్యక్రమానికి రెవెన్యూ అధికారులు శ్రీకారం చుట్టారు. శుక్రవారం మండలంలోని టి.సదుం పంచాయతీలోని అనంతాపురం,చిన్న పొంగుపల్లి గ్రామాల్లోని రైతులకు పొలాల్లో హద్దులు నిర్ధారిస్తూ రాళ్ళను నాటించారు.

జగనన్నను మళ్లీ ఆశీర్వదించండి



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి తదితరులు

కలికిరి: పేదలకు మంచి చేసే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించాలని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు... మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పత్తేగడ గ్రామంలో ఆయన ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గత ప్రభుత్వ హయాంలో అమలు కానీ హామీలతో ప్రజలను మభ్యపెట్టారు తప్ప, సామాన్యులకు ఏలాంటి మేలు చేయలేదని గుర్తుచేశారు. ఈ ప్రభుత్వంలో ఎలాంటి సిఫారస్సులు లేకుండా అర్హులకు నేరుగా లబ్ధి చేకూరుతోందని, పరిపాలనను గ్రామ స్థాయికి తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. ప్రజల గత ప్రభుత్వానికి, ఇప్పటి ప్రభుత్వానికి తేడా గమనించి వచ్చే ఎన్నికలలో జగన్ మోహన్ రెడ్డినే బలపరచాలని కోరారు. కలికిరి పట్టణ పరిధిలోని అమరనాథరెడ్డికాలని, ఆర్.ఎస్.రోడ్డు, టి.బి.రోడ్డు, పల్లవోలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాలలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతల రమేష్ కుమార్ రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ రెడ్డెప్ప, నాయకులు వెంకటపతి, మునెయ్య, వీరభద్రయ్య, ప్రతాప్, ఫయాజ్, బావాజీ, కేఎంఆర్ బావాజాన్, ఈశ్వరయ్య, శిద్దయ్య, సయ్యద్ పాల్గొన్నారు.

వేగం కన్నా ప్రాణం విలువైనది

– టూటౌన్ సీఐ మురళీకృష్ణ



మాట్లాడుతున్న టూటౌన్ సీఐ మురళీకృష్ణ

మదనపల్లె : వేగం కన్నా ప్రాణం విలువైనది అనే నినాదాన్ని వాహనదారులు ప్రతి ఒక్కరూ గుర్తించుకుని వాహనాలు నడపాలని టూటౌన్ సీఐ మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం ఆర్టీవో దినేష్‌చంద్ర, ఆర్అండ్‌బీ డీఈ ఎస్.శ్రీనివాస్, ఏఈ బుర్రయ్యలతో కలిసి పట్టణ పరిసర ప్రాంతాల్లోని తరచూ ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్‌లను గుర్తించారు. పట్టణంలోని చంద్రకాలనీ, అన్నమయ్య సర్కిల్, ప్రశాంత్‌నగర్, నిమ్మనపల్లెక్రాస్, ఉషోదయ స్కూల్, బైపాస్‌రోడ్డులోని ప్రమాద ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతివేగం నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదంలో పెద్ద సంఖ్యలో యువకులు దుర్మరణం పాలవుతున్నారన్నారు. ఒక రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాన్ని రెండు తరాలపాటూ వెనక్కి తీసుకెళుతుందన్నారు. ప్రమాదాల నివారణకు స్పీడు బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. ఇంజినీరింగ్ విభాగం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించి నివేదిక తయారు చేసినట్లు తెలిపారు. ద్విచక్రవాహనదారులు తప్పన హెల్మెట్ ధరించాలని, మలుపులు వద్ద ఓవర్ టెక్ చేయరాదని సూచించారు.

దేవర భక్తుడు ఎన్నికకు తరలిరండి



మాట్లాడుతున్న జన్నే రాజేంద్రనాయుడు

మదనపల్లె : మండలంలోని చీకలబైలు గ్రామం ఎగువమేడిపల్లిలో గజ్జలముడి వంశస్థులతో నూతన దేవర ఎద్దు, దేవర భక్తుడు ఎన్నిక శని, ఆదివారాల్లో జరుగుతుందని పాల ఏకరి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జన్నేరాజేంద్ర తెలిపారు. శుక్రవారం స్థానిక పాల ఏకరి సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయం, ఆచారవ్యవహారాలను నిలబెట్టుకునే క్రమంలో నూతన దేవర ఎద్దు, దేవర భక్తుడి ఎంపికను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మొదటిరోజు దేవర ఎద్దును నిర్ణయించిన తర్వాత రెండోరోజు టేకులపాళ్యం దేవర ఎద్దు ద్వారా మేడిపల్లెలో బత్తుని ఎన్నుకుంటామన్నారు. కార్యక్రమానికి ఎగువ, దిగువ మేడిపల్లె, గొల్లపల్లె, నారేవారిపల్లె, బొంపల్లి, ఆవలపల్లి, మాలేపాడు, దొనబైలు, పాళ్యంకొండ, ఎల్లారుబైలు, మొండెంవారిపల్లె, సామచేను, గట్లు తదితర గ్రామాల్లోని దేవరభక్తులు పాల్గొంటారని చెప్పారు. దేవర ఎద్దు, బత్తుడి ఎన్నిక తర్వాత ఆదివారం రాత్రి పిల్లనగ్రోవులు, మేకతాళాలు, చెక్కభజనలతో గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో చలపతినాయుడు, సదాశివనాయుడు, సిద్ధేశ్వర్, రత్నం నాయునివారు, కంచంగిరిబాబు, రాజగోపాల్, నరసింహులు, చంద్ర, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే చొరవతో తాగునీటి సమస్య పరిష్కారం



టి.పసలవాండ్లపల్లెలో చురుగ్గా సాగుతున్న తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు

గుర్రంకొండ: ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిల చొరవతో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఆరు గ్రామాల తాగునీటి సమస్యలు పరిష్కారమయ్యాయి. ఇటీవల మండలంలోని టి.పసలవాండ్లపల్లె గ్రామ పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆరు గ్రామాలకు చెందిన మహిళలు, ప్రజలు ఆయా గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. వారం రోజుల్లోగా సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈనేపథ్యంలో టి.పసలవాండ్లపల్లెకు రూ.50 వేలు, చాకలపల్లెకు రూ.3.39 లక్షలు, ఎగువ హరిజనవాడకు రూ. లక్ష, ఉదారవాండ్లపల్లెకు రూ. లక్ష, మొరంమీద పల్లెకు రూ. లక్ష, కుమ్మరపల్లెకు రూ. 6 లక్షల నిధులు మంజూరు చేశారు. గత మూడు రోజులుగా ఆయా గ్రామాల్లో పైప్‌లైన్‌తో పాటు ఇతర పనులు చురుగ్గా జరిగాయి. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వేణుగోపాల్‌రెడ్డి, ఏఈ లాల్‌స్వాముల ఆధ్వర్యంలో పనులు త్వరగా పూర్తి చేయడంతో ఆరు గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కారమైంది. దీంతో గ్రామస్తులు హర్షం ప్రకటించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

-ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలనలో కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైనవారిందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని గోపిదిన్నె పంచాయతీ ఉప్పలూరివాండ్లపల్లె, బల్లాపురంపల్లె, గోపిదిన్నె కస్పా, హరిజవాడల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి ప్రజలను పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలు సంబంధిత అధికారులతో చర్చించి అక్కడిక్కడే పరిష్కరించారు. జగనన్న సంక్షేమ పాలనపై ప్రజల అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమ పాలన చేస్తూ విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యత కల్పించిన ఘనత జగన్‌దేనన్నారు. ఫ్యామిలీ డాక్టర్ పేరుతో మారుమూల పల్లెల్లో కూడా వైద్య సేవలు అందించడం చరిత్రలో మరుపురానిదన్నారు. హరిజనవాడలో తాగునీటి సమస్యపై మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన అక్కడ ట్యాంకు ఏర్పాటు చేసి ట్యాప్ కనెక్షన్ ఏర్పాటు చేసేందుకు మండల గ్రాంటు నుంచి రూ.11 లక్షలు ఖర్చు చేయాలని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, సర్పంచు సుధాకర్ రెడ్డి,ఎంపిటీసీ సభ్యురాలు జయమ్మలకు సూచించారు. రాష్ట్ర పద్మాశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, మల్లయ్యకొండ చైర్మన్ మల్లిరెడ్డి, ఆర్‌బీకె చైర్మన్ రెడ్డి మల్‌రెడ్డి, నాయకులు శివారెడ్డి, వి.నారాయణరెడ్డి, మల్లయ్యకొండ ఆలయ ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి, గొర్ల మల్లిరెడ్డి, నరేంద్రరెడ్డి, కరీమ్, రామమూర్తి, కోటిరెడ్డి , ఎంపీడీఓ ఆనందకుమార్, పంచాయతీ కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.

లోకోస్ యాప్ నమోదుపై అవగాహన

– డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ



అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ

మదనపల్లె : దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో మహిళా సమాఖ్యలకు సంబంధించి ఒకే అకౌంటింగ్ విధానం ఉండాలని కేంద్ర ప్రభుత్వం లోకోస్ యాప్‌ను రూపొందించిందని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల మహిళా సమాఖ్య(వెలుగు) కార్యాలయంలో మదనపల్లె డివిజన్ పరిధిలోని 11 మండలాల ఏపీఓ, ఏపీఎం, సీఓలకు లోకోస్ యాప్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ సత్యనారాయణ మాట్లాడుతూ మహిళా సమాఖ్యల్లో సరికొత్త అకౌంటింగ్ విధానాన్ని తీసుకువచ్చే భాగంగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సంయుక్తంగా తీసుకువచ్చిన లోకోస్ యాప్ నమోదుకు సంబంధించి మూడురోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కొత్త విధానంలో అకౌంటింగ్ సిస్టంను ఏ విధంగా ఎంట్రీ చేయాలనే విషయమై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డీపీఎం-ఐబీ వేణుమాధవ్, లక్ష్మీప్రసాదరెడ్డి, రూతు, ఏపీఎం సురేష్, ఏపీఓ, సీఓ, సంఘమిత్రలు పాల్గొన్నారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేద్దాం

– మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

పీలేరు : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పీలేరు పర్యటనను విజయవంతం చేద్దామని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పీలేరు గ్రామపంచాయతీ కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం ఉదయం 8 గంటల నుంచి మండలంలోని వివిధ గ్రామాల్లో ఆర్‌వో ప్లాంట్ల ప్రారంభం ఉంటుందన్నారు. అలాగే స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో అదనపు భవనాలు ప్రారంభోత్సవం, మధ్యాహ్నం ఎంఎం కల్యాణమండపంలో పీలేరు, కేవీపల్లె మండలాల కార్యకర్తల సమావేశంలో మంత్రి పాల్గొంటారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, హబీబ్ బాషా, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షఫీ, హుమయూన్, రమేష్‌రెడ్డి, ఆనంద్, ఉదయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ బృందం ప్రశంస



న్యాక్ పీర్ టీంతో కళాశాల బృందం

వాల్మీకిపురం: వాల్మీకిపురంలోని ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ మదింపు, గుర్తింపు సంస్థ (న్యాక్) పీర్ టీం గత రెండు రోజులుగా పర్యటించింది. తమిళనాడు రాష్ట్రం సేలంలోని పెరియార్ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ముత్తుచెలియన్ నేతృత్వంలోని పీర్ టీం కళాశాలను సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపల్ బాబు తెలిపారు. మిజోరాం విశ్వవిద్యాలయం, వాణిజ్యశాస్త్రశాఖకు చెందిన ఇలంగ్బం నిక్సన్ సింగ్, కర్ణాటక రాష్ట్రం కొడగు జిల్లా మడికేరిలో ఉన్న ఫీల్డ్ మార్షల్ కెఎం కరియప్ప కళాశాల పూర్వ ప్రిన్సిపల్ డాక్టర్ పార్వతి అప్పయ్య కళాశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల శాఖధిపతులు సమర్పించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకించారు. కళాశాల ఉన్నత ఆశయాలతో ప్రగతి పథంలో నడుస్తుందని, మంచి ప్రమాణాలను పాటిస్తుందని ప్రశంసించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సారా విక్రయాలపై పల్లె ప్రజల తిరుగుబాటు

మదనపల్లె : సారా తయారీ, విక్రయాలు నేరమని, ప్రజారోగ్యం దృష్ట్యా వాటిని మానుకోవాలని ప్రభుత్వం, ఎస్ఈబీ అధికారులు చేస్తున్న ప్రచారం సత్ఫలితాలనిస్తోంది. మండలంలోని దుబ్బిగానిపల్లె పంచాయతీ రెడ్డివారిపల్లెలో సారా విక్రయాలను అరికట్టేందుకు గ్రామస్తులే స్వచ్ఛందంగా విక్రేతలను పోలీసులకు అప్పగించిన ఘటన శుక్రవారం జరిగింది. గ్రామంలో విచ్చలవిడిగా జరుగుతున్న సారా విక్రయాలపై కొందరు గ్రామస్తులు స్పందన కార్యక్రమంలో భాగంగా ఎస్ఈబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎస్ఈబీ ఇన్‌చార్జ్ సీఐ శ్రీహరిరెడ్డి వారంరోజుల క్రితం గ్రామంలో దాడులు నిర్వహిస్తే నిందితులు తెలివిగా తప్పించుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం గ్రామానికి చెందిన శాంతమ్మ (50), బి.షర్మిల (33)లు సారాను క్యాన్లలో నుంచి చిన్నచిన్న పొట్లాల్లోకి మారుస్తుండగా గమనించిన గ్రామస్తులు వారిని పట్టుకుని ఎస్ఈబీ అధికారులకు సమాచారం అందించారు. సీఐ శ్రీహరిరెడ్డి వెంటనే రెడ్డివారిపల్లెకు చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకుని, గ్రామస్తుల్లో వచ్చిన చైతన్యాన్ని అభినందించారు. ప్రతి ఒక్కరూ రెడ్డివారిపల్లె గ్రామస్తులను ఆదర్శంగా తీసుకుంటే మదనపల్లె ఎస్ఈబీ పరిధిలో సారా విక్రయాలు పూర్తిస్థాయిలో అరికట్టేందుకు వీలవుతుందన్నారు.

ఇంటర్ ఫలితాల్లో చైతన్య విద్యార్థుల ప్రతిభ



సాయిపవిత్ర



షాహిల్‌ఖాన్



చరణ్‌తేజ

పీలేరు రూరల్ : ఇంటర్మీడియట్ ఫలితాల్లో స్థానిక శ్రీ చైతన్య కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు ప్రిన్సిపాల్ కె. నాగార్జునరెడ్డి, కరస్పాండెంట్ సుధానందరెడ్డి తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీలో పి. సాయిపవిత్ర 988, ఎస్.ఎం. మొహరూన్ 983, ఎంపీసీలో ఎస్. షాహిల్‌ఖాన్ 988, బి. సోనీప్రియ 971, సీఈసీలో చరణ్‌తేజ 933, జి. నరసింహులు 925 మార్కులు సాధించినట్లు తెలిపారు. అలాగే ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో కె మానస 453, సీఈసీలో హిమకిరణ్ 437 మార్కులు సాధించి ప్రతిభ చూపినట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ తోపాటు డైరెక్టర్ పి. జనార్ధన్‌రెడ్డి, ఎస్. చంద్రశేఖర్, లోకేశ్వర్‌రెడ్డి అభినందించారు.

స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాలు వేగవంతం

డీపీఓ ధనలక్ష్మి



వేపూరికోట సచివాలయం సిబ్బందితో మాట్లాడుతున్న డీపీఓ ధనలక్ష్మి

ములకలచెరువు: జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని వేగవంతంగా అమలు చేయాలని డీపీఓ ధనలక్ష్మి పంచాయతీరాజ్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం డీపీఓ మండలంలోని కదిరినాథునికోట, వేపూరికోట సచివాలయం, చెత్త నుంచి సంపద కేంద్రాలను పరిశీలించారు. సచివాలయం సిబ్బందితో మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలు, సిబ్బంది పనితీరుపై చర్చించారు. అనంతరం వేపూరికోట పంచాయతీ రెడ్డివారిపల్లె అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి వసతులు, పౌష్టికాహారం ఇస్తున్న తీరుపై ఆరా తీశారు. గర్భిణులు, చిన్నారులతో మాట్లాడారు. ఎంపీడీఓ అశ్వని, సర్పంచులు సునీత, శంకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు డీపీఓ వెంట ఉన్నారు.